## క్లుప్తంగా

### వీబీఆర్‌కు 6,600 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో



నిండుకుండలా ఉన్న వెలుగోడు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్

వెలుగోడు: వెలుగోడు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌కు కృష్ణా జలాలు వచ్చి చేరుతున్నాయి. బానకచెర్ల క్రాస్ రెగ్యులేటర్ నుంచి వీబీఆర్‌కు మంగళవారం 6,600 క్యూసెక్కుల నీరు వచ్చి చేరినట్లు ఏఈఈ శివనాయక్ తెలిపారు. వీబీఆర్ నుంచి మద్రాస్ కాల్వకు 2,800 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు చెప్పారు. ప్రస్తుతం రిజర్వాయర్‌లో 263.76 మీటర్ల వద్ద 865.353 అడుగులతో 15.355 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఏఈ చెప్పారు. జలాశయానికి నీరు వచ్చి చేరుతుండటంతో పర్యాటకుల సందడి నెలకొంది.

### ఉచిత యోగా శిక్షణ



యోగా శిక్షణలో పాల్గొన్న దేవస్థాన సిబ్బంది, భక్తులు, స్థానికులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థాన సిబ్బంది, స్థానికులు, భక్తుల సౌకర్యార్థం ఉచిత యోగా శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. మంగళవారం ఉదయం చంద్రవతి కల్యాణ మండపంలో ఉదయం 7 నుంచి 8.30 గంటల వరకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ప్రతి మంగళ, బుధవారాలు యోగా శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నారు. ఒంగోలుకు చెందిన ప్రముఖ యోగా గురువు గంధవళ్ళ బాలసుబ్రహ్మణ్యం వారిచే శిక్షణ ఇస్తున్నారు. యోగాపై అవగాహన కల్పించేందుకు ఉచిత శిక్షణ ఏర్పాటు చేశామని దేవస్థాన ఈఓ తెలిపారు.

### గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుదాం




చెత్త సేకరణను పరిశీలిస్తున్న ఎంపీడీఓ

వెలుగోడు: గ్రామాలను పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రజల నుంచి తడి, పొడి చెత్తను సేకరించాలని ఎంపీడీఓ మధుసూన్‌రెడ్డి గ్రీన్‌అంబాసిడర్లకు సూచించారు. మంగళవారం మోతుకూరు గ్రామంలో ఇంటింటా చెత్త సేకరణ పనులను ఎంపీడీఓ తనిఖీ చేశారు. చెత్తసేకరణను పర్యవేక్షించాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు.

### అలరించిన నృత్యప్రదర్శన

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథం కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్యకళావేదికపై హన్మకొండకు చెందిన హంపి నాట్యకళా నిలయం వారి సంప్రదాయ నృత్యప్రదర్శన అలరించింది. మూషికవాహన, శివపాద మంజీరనాదం, కాలభైరవాష్టకం, తాండవనృత్యం, అఖిలాండేశ్వరి, శంభో శివశంభో తదితర గీతాలకు భావన, తేజ, వేదశ్రీ, అనుశ్రీ, సమన్వితప్రియ, సాక్షారెడ్డి, అనుశ్రీ, కీర్తన, లలిత తదితరులు నృత్యప్రదర్శన చేశారు.

### కుక్కలకు యాంటీ రేబీస్ టీకాలు



కుక్కలకు వ్యాక్సిన్ వేస్తున్న అధికారులు

పాములపాడు: మండలంలోని బానుముక్కల గ్రామంలో ఎంపీడీఓ చంద్రశేఖర్ మంగళవారం వీధి కుక్కలకు యాంటీ రేబీస్ టీకాలు వేయించారు. ఈనెల 19న గ్రామంలో ఏడేళ్ల బాలిక జయమ్మకు పిచ్చి కుక్క కరిచిన విషయం విదితమే. దీంతో అధికారులు రంగంలోకి దిగారు. గ్రామంలోని 34 పెంపుడు, వీధి కుక్కలకు వ్యాక్సిన్ వేయించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీఓ సులోచన, పంచాయతీ కార్యదర్శి రంగారెడ్డి, వెటర్నరీ అసిస్టెంట్ లక్ష్మి ప్రసన్న పాల్గొన్నారు.

### భక్తిశ్రద్ధలతో మౌలాలి స్వామి సరిగెత్తు

పాములపాడు: మండలంలోని రుద్రవరం గ్రామంలో మంగళవారం మౌలాలిస్వామి చిన్న సరిగెత్తును భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గ్రామంలోని పీర్ల చావిడిలో కొలువుదీరిన స్వామి వారికి భక్తులు పెద్ద ఎత్తున దట్టీలు, పూల షేరాలు సమర్పించారు. అర్ధరాత్రి నుంచి డప్పు వాయిద్యాలతో స్వామి వారి ఊరేగింపు నిర్వహించారు. ప్రజలు కాయకర్పూరాలు సమర్పించి స్వామి వారిని దర్శించుకున్నారు.

# కూటమి నాయకులకు చివరి అడుగు



సమావేశానికి హాజరైన వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు



మాట్లాడుతున్న శిల్పా చక్రపాణిరెడ్డి

- వైఎస్సార్‌సీపీ శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి

బండి ఆత్మకూరు: సుపరిపాలన పేరుతో తొలి అడుగు అని గ్రామాల్లోకి వెళ్తున్న కూటమి నాయకులకు అదే చివరి అడుగని, వచ్చే ఎన్నికల్లో ప్రజలు భూస్థాపితం చేయడం ఖాయమని వైఎస్సార్‌సీపీ శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో నిర్వహించిన బాబు ష్యూరిటీ – మోసం గ్యారంటీ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అడ్డమైన హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చాక రాష్ట్రం క్లిష్ట పరిస్థితుల్లో ఉందని మొసలి కన్నీరు కార్చడం పార్టీ ఇయర్స్ ఇండస్ట్రీ చంద్రబాబు నాయుడుకే సాధ్యమన్నారు. బాబు మోసాలను గ్రామాల్లో ప్రజలకు వివరించాలని కార్యకర్తలకు సూచించారు.

**అభివృద్ధిపై చర్చకు సిద్ధమా?**

సూపర్ -6 పథకాలు అమలు చేస్తామని అధికారంలోకొచ్చి, పథకాల అమలు చేతకాక నియోజకవర్గంలో ప్రతి పనిపై స్థానిక ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి ట్యాక్స్ వసూలు చేస్తున్నారని శిల్పా చక్రపాణి రెడ్డి ఆరోపించారు. నియోజకవర్గంలో జరిగిన అభివద్ధిపై చర్చకు సిద్ధమా అని సవాల్ విసిరారు. కడమలకాలవ గ్రామాన్ని రూ.1.8 కోట్లతో అభివృద్ధి చేసిన ఘనత గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానిదేనన్నారు. కేవలం రూ.20 లక్షలలో అదే గ్రామంలో అంతర్గత రోడ్లను నాసిరకంగా నిర్మించి అభివద్ధి చేశానని గొప్పలు చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా అభివృద్ధి పనులు చేసింది కేవలం తానేనని, ఇదే విషయం ప్రజలకు తెలుసని శిల్పా చెప్పారు.

**సాగు నీరిచ్చింది కూడా మేమే**

వైఎస్సార్‌సీపీ అధికారంలో ఉండగా వెలుగోడు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌లో కేవలం మూడు టీఎంసీల నీరు ఉన్నా కూడా అన్ని మండలాల రైతులను సమన్వయం చేసి, ఎవరూ నష్టపోకుండా పంటకు సాగు నీరు ఇచ్చింది తామేనని చక్రపాణిరెడ్డి తెలిపారు. నియోజకవర్గానికి పెద్దన్నగా ఉండి రైతులందరి సమస్యలను తీరుస్తూ తన వంతు సహాయ సహకారాలు అందించానన్నారు. ఎప్పటికప్పుడు రైతుల సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారం కోసం అహర్నిశలు కృషి చేశానన్నారు. రైతు బిడ్డనని చెప్పుకునే బుడ్డా.. మండలంలోని ఎరగ్రుంట్ల గ్రామంలో పొగాకు రైతులు పడే కష్టాలను పట్టించుకోకపోవడం సిగ్గుచేటన్నారు.

**అరెస్టులకు బెదరం**

కూటమి నేతలు అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రెడ్ బుక్ రాజ్యాంగం పేరుతో ఇష్టమొచ్చిన రీతిలో వైఎస్సార్‌సీపీ నాయకులను, కార్యకర్తలను అరెస్టు చేస్తున్నారని, అయినా బెదిరేవాళ్లు ఎవరూ లేరని చక్రపాణిరెడ్డి అన్నారు. అభివృద్ధి చేయడం చేతకాక ఇష్టం వచ్చిన విధంగా నోరు పారేసుకోవడం ఎమ్మెల్యేకు తగదన్నారు. కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలం చెందిందని, రాబోయేది కచ్చితంగా జగనన్న ప్రభుత్వమేనని, అందుకోసం ప్రతి కార్యకర్త సైనికుడిగా పని చేయాలని సూచించారు. కూటమి నేతల మోసాలను ఇంటింటికి వెళ్లి ప్రజలకు వివరించాలన్నారు. తొలి అడుగు పేరుతో గ్రామాలకు వస్తున్న కూటమి నేతలను ప్రజలతో కలిసి అభివృద్ధిపై నిలదీయాలన్నారు. ప్రతి కార్యకర్తకూ తాను అండగా ఉంటానన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ నాయకుడు శిల్ప భువనేశ్వర్ రెడ్డి, బీసీ జనరల్ సెక్రటరీ బోగోలు శివశంకర్ నాయుడు, రాష్ట్ర మహిళా జనరల్ సెక్రటరీ శశికళ రెడ్డి, పార్టీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు రాజం రెడ్డి సుజాతమ్మ, ఇంటలెక్చువల్ ఫోరం అధ్యక్షులు ఇటికెల చిన్న సుబ్బారెడ్డి, పార్టీ మండల అధ్యక్షులు బారెడ్డి విజయభాస్కర్ రెడ్డి, ఎంపీపీ దేరెడ్డి చిన్న సంజీవరెడ్డి, మాజీ ఎంపీపీ దేసు వెంకటరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### స్మార్ట్ మీటర్లు అమర్చడం తగదు

జూపాడుబంగ్లా: ప్రతిపక్షంలో ఉన్నప్పుడు స్మార్ట్ మీటర్లు పగలగొట్టండని సలహా ఇచ్చిన చంద్రబాబునాయుడు అధికారంలోకి వచ్చాక అవే స్మార్ట్ మీటర్లను అమర్చటం సిగ్గుచేటని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు నాగేశ్వరరావు తెలిపారు. మంగళవారం కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్మార్ట్ మీటర్లు అమర్చడం వల్ల ప్రజలపై మరింత విద్యుత్ భారం పడే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం స్మార్ట్ మీటర్ల ఆలోచనను విరమించుకోవాలన్నారు.

### చట్టాలపై అవగాహన అవసరం



చట్టాలపై అవగాహన కల్పిస్తున్న రూరల్ సీఐ సుబ్రహ్మణ్యం

నందికొట్కూరు: చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని రూరల్ సీఐ సుబ్రహ్మణ్యం విద్యార్థులకు సూచించారు. మంగళవారం మండల పరిధిలోని దామగట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెడ్డు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. మత్తు పదార్థాలకు బానిసలై జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు. బాలికలకు ఎలాంటి ఇబ్బంది కలిగినా, అనుమానాలు వచ్చినా పోలీసులను ఆశ్రయించాలన్నారు. బ్రాహ్మణకొట్కూరు ఎస్ఐ తిరుపాలు పాల్గొన్నారు.

# సమయపాలన పాటించాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ

కొత్తపల్లి: సమయపాలన పాటించాలని ఎంపీడీఓ మేరి సచివాలయ సిబ్బందికి సూచించారు. మంగళవారం ఎంపీడీఓ కార్యాలయంలో డేటా ఎంట్రీ ఆపరేటర్లు, వెల్ఫేర్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ప్రతిఒక్కరూ సమయ పాలన పాటిస్తూ సచివాలయానికి వచ్చేవారితో మర్యాదగా నడుచుకోవాలని సూచించారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే నోటీసులు జారీ చేస్తామని హెచ్చరించారు.

- జూపాడుబంగ్లా: సకాలంలో విధులకు హాజరుకాకపోతే చర్యలు తప్పవని ఎంపీడీఓ గోపికృష్ణ సచివాలయ ఉద్యోగులను హెచ్చరించారు. మంగళవారం ఆయన పారుమంచాల సచివాలయాన్ని తనిఖీ చేశారు. హాజరుపట్టికను పరిశీలించి విధులకు హాజరవ్వని ఉద్యోగుల వివరాలు తెలుసుకున్నారు.
- ఈనెల 24 నుంచి మూడు రోజులపాటు పారుమంచాల, పి.లింగాపురం, జూపాడుబంగ్లా గ్రామాల్లో నేషనల్ లెవెల్ మానిటరింగ్ టీం పర్యటించనున్నట్లు ఎంపీడీఓ గోపీకృష్ణ తెలిపారు.

# ఆధునిక పద్ధతులు పాటించాలి



నందికొట్కూరు: మొక్క జొన్న రైతులతో మాట్లాడుతున్న వ్యవసాయ అధికారులు

నందికొట్కూరు: వ్యవసాయంలో ఆధునిక పద్ధతులు పాటించి అధిక దిగుబడులు సాధించాలని వ్యవసాయ సహాయ సంచాలకులు గిరీష్ రైతులకు సూచించారు. మంగళవారం మండల పరిధిలోని బ్రాహ్మణకొట్కూరు, దామగట్ల గ్రామాల పరిధిలోని పొలాల్లో పొలంబడి, పొలం పిలుస్తోంది కార్యక్రమాలు నిర్వహించి రైతులకు ఆయన పలు సూచనలు ఇచ్చారు. భూసార పరీక్షల ఫలితాల ఆధారంగా ఎరువులను వేసుకోవాలన్నారు.

- బండి ఆత్మకూరు: సస్య రక్షణ పద్ధతులు పాటించి నాణ్యతతో కూడిన దిగుబడులు సాధించాలని మండల వ్యవసాయ అధికారి ఆర్ పవన్ కుమార్ రైతులకు సూచించారు. మండలంలోని పార్నపల్లి గ్రామ పొలంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించి రైతులకు సలహాలిచ్చారు. కార్యక్రమంలో వెటర్నరీ డాక్టర్ జ్యోత్స్న పాల్గొన్నారు.
- వెలుగోడు: ఖరీఫ్‌లో సాగు చేసిన ప్రతి పంటలు నమోదు చేయించుకోవాలని ఏఓ స్వాతి రైతులకు సూచించారు. మంగళవారం గుంతకందాల, అబ్దుల్లాపురం గ్రామాల పరిధిలోని పొలాల్లో నిర్వహించిన పిలుస్తోంది కార్యక్రమాల్లో ఆమె పాల్గొని మాట్లాడారు.
- జూపాడుబంగ్లా: పంటలకు అధిక మోతాదులో రసాయనిక ఎరువులు వాడవద్దని మండల వ్యవసాయ అధికారి కృష్ణారెడ్డి సూచించారు. మంగళవారం తర్తూరు గ్రామ పొలంలో పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఆర్ఎస్కేలో నిర్వహించిన సమావేశంలో రైతులకు పలు సూచనలిచ్చారు.

**ఉద్యాన పంటలతో ప్రయోజనాలు మెండు**

జూపాడుబంగ్లా: ఉద్యాన పంటల సాగుతో లాభాలు ఆర్జించవచ్చని జిల్లా ఉద్యానవనశాఖ అధికారి నాగరాజు తెలిపారు. మంగళవారం ఆయన తంగడంచ, మండ్లెం, నందికొట్కూరు మండలంలోని మద్దిగట్ల గ్రామాల్లో సాగుచేసిన ఉద్యాన పంటలను పరిశీలించి రైతులకు సలహాలిచ్చారు. ఆయన వెంట నియోజకవర్గ హార్టికల్చర్ అధికారిణి తేజశ్విని పాల్గొన్నారు.


# జల జీవన్ పనుల పరిశీలన



ట్యాంకును పరిశీలిస్తున్న నేషనల్ వాస్ ఎక్స్‌పర్ట్ శిరోన్‌జిబ్ సైకియా

పాములపాడు: మండలంలోని ఎర్రగూడూరులో జలజీవన్ మిషన్ కింద జరిగిన పనులను మంగళవారం నేషనల్ వాస్ ఎక్స్‌పర్ట్ శిరోన్‌జిబ్ సైకియా పరిశీలించారు. నిరుపయోగంగా ఉన్న మైక్రో ఫిల్టర్‌ను పరిశీలించారు. ఓహెచ్ఎస్ఆర్ ట్యాంకు, జలజీవన్ మిషన్‌లో భాగంగా నిర్మాణం చేపట్టిన పైపులైన్లు, కుళాయిలు, వ్యక్తిగత మరుగుదొడ్లు, పారిశుధ్య పనులను పరిశీలించారు. ఎంపీడీఓ కార్యాలయంలో శానిటేషన్ కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. అనంతరం మండల కేంద్రంలో ఓహెచ్ఎస్ఆర్ ట్యాంకు జీఎల్ఎస్ఆర్ ట్యాంకులను పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట సర్పంచు మేకల భాగ్యమ్మ నందికొట్కూరు, ఆత్మకూరు ఆర్‌డబ్ల్యూఎస్ డీఈలు శ్రీనివాసరెడ్డి, ఉమాకాంత్‌రెడ్డి,ఎంపీడీఓ చంద్రశేఖర్ ఏఈలు సువత్సల, పక్కీరయ్య, ఎస్‌బీఎం డిస్ట్రిక్ కన్సలెంట్ విజయ్‌కుమార్ ఉన్నారు.

### విద్యార్థినులకు దుప్పట్ల పంపిణీ



విద్యార్థినులకు దుప్పట్లు అందజేస్తున్న ఎంపీడీఓ, ఎంఈఓ

పగిడ్యాల: స్థానిక ఆదర్శ పాఠశాలలో విద్యనభ్యశించే 25 మంది హాస్టల్ విద్యార్థినులకు మంగళవారం ఎంపీడీఓ సుమిత్రమ్మ దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మండల విద్యాధికారి సుభాన్ మాట్లాడుతూ నందికొట్కూరు తహసీల్దార్ శ్రీనివాసులు ఆర్థిక సహకారంతో ఏర్పాటు చేసిన దుప్పట్లను విద్యార్థినులకు అందజేశామన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మల్లికార్జునరెడ్డి పాల్గొన్నారు.

### వీరభద్రుడికి ప్రత్యేక పూజలు



పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలోని క్షేత్రపాలకునిగా ప్రసిద్ధిగాంచిన బయలు వీరభద్ర స్వామికి, ఆలయ ప్రాంగణంలోని శనగల బసవన్నగా పేరుపొందిన నందీశ్వరునికి మంగళవారం ఆలయ అధికారులు, అర్చకులు విశేష పూజలు నిర్వహించారు. ఇందులో భాగంగా ప్రదోషకాల సమయంలో క్షేత్రపాలకుడు వీరభద్రునికి, నందీశ్వరునికి పంచామృతాలతో అభిషేకాది అర్చనలు నిర్వహించారు. ఆరంభ పూజల్లో భాగంగా లోక క్షేమాన్ని కాంక్షిస్తూ సంకల్పాన్ని పఠించారు. కార్యక్రమాలు నిర్విఘ్నంగా జరిగేందుకు గణపతి పూజ చేశారు. అనంతరం నందీశ్వర స్వామికి నూతన వస్త్రసమర్పణ విశేషార్చనలను, నానబెట్టిన శనగలను, క్షేత్రపాలకునికి ప్రత్యేక నైవేద్యాన్ని సమర్పించి కర్పూర నీరాజనాలు అర్పించారు.

కుమారస్వామికి: శ్రీశైల భ్రమరాంబా మల్లికార్జునస్వామివార్ల ఆలయ ప్రాంగణంలోని కుమార స్వామి ఉపాలయంలో మంగళవారం ఆలయ అధికారులు, అర్చకులు విశేష క్రతువులను నిర్వహించారు. కుమారస్వామికి అభిషేకం, సుబ్రహ్మణ్య, అష్టోత్తరం అనంతరం స్తోత్రపారాయణలు చేశారు. సుబ్రహ్మణ్యస్వామి అభిషేకంలో స్వామివారికి పంచామృతాలు, వివిధ పండ్ల రసాలతో అభిషేక కార్యక్రమం నిర్వహించారు.

### నేడు 'బాబు ష్యూరిటీ - మోసం గ్యారంటీ'

ఆత్మకూరు: మండలంలోని వడ్లరామాపురం గ్రామంలో బుధవారం సాయంత్రం 4 గంటలకు బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ పట్టణ, మండల అధ్యక్షులు సయ్యద్‌మీర్, రాజమోహన్‌రెడ్డి మంగళవారం తెలిపారు. గురువారం సాయంత్రం ఆత్మకూరు పట్టణంలోని గొల్లపేట రావిచెట్టు అరుగు వద్ద బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని చేపడతామన్నారు. ఆయా కార్యక్రమాల్లో మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి పాల్గొంటారని, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు.

### హామీలన్నీ నెరువేరుస్తాం

పాములపాడు: ఎన్నికల ముందు ఇచ్చిన హామీలన్నీ నెరుస్తామని ఎమ్మెల్యే గిత్తా జయసూర్య అన్నారు. మంగళవారం మండలంలోని మిట్టకందాల గ్రామంలో సుపరిపాలన తొలిఅడుగు కార్యక్రమం నిర్వహించారు. ఆయన ప్రజలకు కరపత్రాలు పంపిణీ చేస్తూ తల్లికి వందనం పథకం అందరికి వచ్చిందా అని అడిగారు. అనంతరం ఎస్సీ కాలనీలోని అంగన్‌వాడీ సెంటర్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ చంద్రశేఖర్, డిప్యూటీ ఎంపీడీఓ సులోచన, హెల్త్ ఎడ్యుకేటర్ మల్లికార్జున, ఏపీఎం ఉమామహేశ్వరి పాల్గొన్నారు.

### ఉపాధ్యాయులను నియమించాలి

ఆత్మకూరు: విద్యార్థుల సంఖ్యకు తగిన విధంగా ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులను నియమించాలని గిరిజన ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షులు జవహర్‌నాయక్ డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ శ్రీశైలం ఐటీడీఏ పరిధిలోని జానాలగూడెం, ఇందిరేశ్వరం చెంచుగూడెం, గాజులపల్లి గూడెంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలు ఉపాధ్యాయులు లేక మూతపడ్డాయన్నారు. ఉపాధ్యాయులను నియమించి మూతబడిన పాఠశాలలను తెరిపించాలన్నారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనలకు దిగుతామని ఆయన హెచ్చరించారు.

### సేవలు సద్వినియోగం చేసుకోండి

పాములపాడు: పోస్టాఫీసులో ఐటీ 2.0 సేవలు ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పోస్టు మాస్టర్ మనోజ్ కుమార్ తెలిపారు. మంగళవారం స్థానిక పోస్టుఆఫీసులో ఆయన మాట్లాడుతూ సాంకేతికతను అందిపుచ్చుకుని ప్రజలకు త్వరితగతిన నాణ్యమైన సేవలు అందించనున్నట్లు తెలిపారు.

### ● నాణ్యత డొల్ల!

కూటమి ప్రభుత్వం విద్యార్థులకు పంపిణీ చేసిన బ్యాగుల నాణ్యతలో డొల్లతనం బయటపడుతోంది. 2025-26 విద్యా సంవత్సరానికి కొత్తపల్లి మండలంలో 3,500 మందికిపైగా విద్యార్థులకు పంపిణీ చేసిన యూనిఫామ్, బ్యాగ్‌లు నాసిరకంగా ఉన్నాయని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. రెండు నెలలు కూడా గడవక ముందే బ్యాగుల జిప్‌లు ఫెయిల్ అవడం, బ్యాగులు చిరిగిపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గువ్వలకుంట్ల గ్రామంలోని ఓ విద్యార్థి చిరిగిన బ్యాగుకు కుట్లు వేయించుకుని, జిప్ ఫెయిల్ అయిన బ్యాగులో పుస్తకాలు పెట్టుకొని పాఠశాలకు వెళ్తున్న ఈ దృశ్యమే నాసిరకంగా ఉన్నాయనేందుకు నిదర్శనం. – కొత్తపల్లి



# ప్రభుత్వ ఉద్యోగులకు బదిలీలు సర్వసాధారణం



ఏడీఏ ఆంజనేయ, ఏఓ ఫణీశ్వరరెడ్డిలను సన్మానిస్తున్న డీలర్ల అసోసియేషన్ సభ్యులు

పాములపాడు: ప్రభుత్వ ఉద్యోగులకు బదిలీలు సర్వ సాధారణమని ఏడీఏ ఆంజనేయ అన్నారు. మంగళవారం స్థానిక మండల వ్యవసాయాధికారి కార్యాలయం వద్ద బదిలీపై ఆత్మకూరు నుంచి నంద్యాలకు వెళ్లిన ఏడీఏ ఆంజనేయ, పాములపాడు నుంచి నందికొట్కూరుకు బదిలీపై వెళ్లిన మండల వ్యవసాయాధికారి ఫణీశ్వరరెడ్డిలను మండల పురుగు మందుల డీలర్ల అసోసియేషన్ నాయకులు సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎక్కడ విధులు నిర్వహించినా సంతృప్తిగా ఉండేలా పని చేయాలన్నారు. రైతులకు సేవలందించడంలో అధికారులతో పాటు డీలర్ల పాత్ర కూడా కీలకమన్నారు. నాణ్యమైన మందులు, ఎరువులు, విత్తనాలు విక్రయించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ చంద్రశేఖర్, మండల వ్యవసాయాధికారి మహేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

- పగిడ్యాల: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని కొత్త పాలమర్రి, లక్ష్మాపురం 1, పగిడ్యాల 3, పాత ముచ్చుమర్రి, కె.ముచ్చుమర్రి, కొణిదేల, 1, 2, నెహ్రూనగర్ 1,2 , పగిడ్యాల 1 సచివాలయాల్లో విధులు నిర్వహిస్తూ బదిలీ వెళ్తున్న ఆరోగ్య కార్యకర్తలను మంగళవారం వైద్యాధికారి క్రిష్ణమూర్తి ఘనంగా సన్మానించారు.

# ఉధృతంగా ప్రవహిస్తున్న భవనాశి



నీటిలో నందీశ్వరాలయం



ఉధృతంగా ప్రవహిస్తున్న భవనాశి నది

పాములపాడు: నల్లమల అటవీ ప్రాంతం నుంచి ప్రవహిస్తున్న వర్షపు నీటితో మండలంలోని ఇస్కాల గ్రామ సమీపంలో ఉన్న భవనాశి నది మంగళవారం ఉధృతంగా ప్రవహిస్తోంది. మండలంలో 4.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. మూడు రోజులుగా కురుస్తున్న వర్షాల వల్ల ఎగువ ప్రాంతాల నుంచి వరద నీరు భారీగా వస్తోంది. భవనాశి ఉధృతంగా ప్రవహించడంతో ప్రజల రాకపోకలు మండలకేంద్రానికి నిలిచిపోయాయి. అత్యవసరమనుకుంటే ఆత్మకూరు మీదుగా రాకపోకలు సాగిస్తున్నారు. ఇక నది ఒడ్డున ఉన్న నందీశ్వరాలయం చుట్టూ నీరు చేరింది.

- ఆత్మకూరు: మండలంలో మంగళవారం 15.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. వర్షం రాకతో ముందస్తు సాగు చేసిన పైర్లకు కాస్త మేలు అవుతుందని రైతులు పేర్కొంటున్నారు.

## యూరియా సరఫరాలో కూటమి ప్రభుత్వం విఫలం



మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

నందికొట్కూరు: రైతులకు యూరియా సరఫరా చేయడంలో కూటమి ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని సీపీఎం నాయకులు ఫక్కీర్‌సాహెబ్ విమర్శించారు. మంగళవారం మార్కెట్ యార్డులోని రైతు సేవా కేంద్రం వద్ద రైతులతో కలిసి విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. డీసీఎంఎస్ ద్వారా రైతులకు అందాల్సిన యూరియా పక్కదారి పడుతోందని ఆరోపించారు. కౌలు రైతులకు యూరియా ఇవ్వకపోతే పంటలను ఎలా సాగు చేసుకుంటారని ప్రశ్నించారు. అధికారులు యూరియా పక్కదారి పట్టకుండా పర్యవేక్షించాలని, కౌలు రైతులకు కూడా యూరియాను ఇవ్వాలని కోరారు.

## నివాళి



అచ్యుతానందన్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

ఆత్మకూరు: కమ్యూనిస్టు ఉద్యమ యోధుడు, సీపీఎం అగ్రనేత కామ్రేడ్ వీఎస్ అచ్యుతానందన్ చిత్రపటానికి పలువురు నివాళులర్పించారు. మంగళవారం పట్టణంలోని డాక్టర్ ఎ.ధనుంజయ మీటింగ్ హాల్‌లో జరిగిన కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వి.యేసురత్నం, సీనియర్ నాయకులు ఎ.రాజశేఖర్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు నరసింహానాయక్, ఆత్మకూరు మండల కార్యదర్శి సుధాకర్, సీనియర్ నాయకులు రజాక్, సీనియర్ పాత్రికేయులు జోసెఫ్ చంద్రశేఖర్, నాయకులు మాబాషా, డి.రామ్‌నాయక్, సురేంద్ర, వీరన్న, నాయకులు సామేలు, రవి, పెద్దఅంబయ్య, శిలార్, మల్లయ్య, ముర్తుజా, పుల్లయ్య, శీను, జబీవుల్లా, ఖాదర్, లింగస్వామి, రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## చినుకు పడితే చిత్తడే!



వర్షపు నీటిలో పాఠశాలకు వెళ్తున్న విద్యార్థులు

కొత్తపల్లి: చిన్నపాటి వర్షానికే మండలంలోని జి.వీరాపురం గ్రామంలోని ఎస్సీ కాలనీ రోడ్లు చిత్తడిగా మారుతున్నాయి. మురుగు కాలువలు లేకపోవడంతో వర్షపు నీరు పోయే మార్గం లేక రోడ్లపైనే నిలిచిపోవడంతో పాదచారులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా ఫలితం లేదని స్థానికులు వాపోతున్నారు.

# మౌలిక వసతుల కల్పనకు ప్రతిపాదనలు

పగిడ్యాల: మండలంలో ఎంపికై న ఎనిమిది ఆదర్శ ప్రాథమిక పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రతిపాదనలు తయారు చేయాలని మండల విద్యాధికారి సుభాన్ కోరారు. ఎంపీడీఓ సుమిత్రమ్మతో కలిసి మంగళవారం స్థానిక విద్యాశాఖ కార్యాలయంలో హెచ్ఎంలు, ఇంజినీరింగ్, వెల్ఫేర్ అసిస్టెంట్స్‌తో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ ఆదర్శ ప్రాథమిక పాఠశాలలుగా పగిడ్యాలలో 3, లక్ష్మాపురం, పడమర ప్రాతకోట, పాత ముచ్చుమర్రి, నెహ్రూనగర్‌లో 2 ఒప్పున ఎంపికయ్యాయని, వాటిల్లో మౌలిక సదుపాయాలను పేరెంట్స్ కమిటీతో కలిసి గుర్తించి ప్రతిపాదనలను ఎంఈఓ కార్యాలయానికి పంపాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ -2 మురళీమోహన్‌రెడ్డి పాల్గొన్నారు.